క్లుప్తంగా

ఘనంగా మసీదు ప్రారంభం



ఆత్మకూరురూరల్: నల్లపరెడ్డిపల్లిలోని బీసీకాలనీలో ముస్లిం మతపెద్దలు షేక్ రహమతుల్లా, షేక్ బాబు ఆధ్వర్యంలో నూతన మస్జీద్-ఏ-నూర్ మసీదును బుధవారం ప్రారంభించారు. ఖతమే నబువ్వత్ ట్రస్ట్ అధ్యక్షుడు మౌలానా అర్షద్అలీ ముఖ్యఅతిథిగా హాజరై మసీదు నిర్వహణ, ఇమామ్ పాత్రను వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆత్మకూరు పెద్ద మసీదు అధ్యక్షుడు అహమ్మద్, రహమతీయ మసీదు మెంబర్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్సీ తనిఖీ



సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏడీఎంహెచ్ఓ ఖాదర్వలి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని రోనాల్డ్రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందితో మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండాజోల్ మాత్రలు వేసుకోని చిన్నారులకు అందజేసి నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పీహెచ్సీకి తీసుకొచ్చి పరీక్షలు చేయించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి అశోక్, సిబ్బంది ఉన్నారు.

కారు బోల్తా ఇద్దరికి గాయాలు



ఉదయగిరి రూరల్: మండలంలోని దాసరిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కారు బోల్తాపడడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సీతారామపురం మండలం బసినేనిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పని నిమిత్తం కారులో నెల్లూరు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో దాసరిపల్లి సమీపంలో ఒక్కసారిగా అటవీ ప్రాంతం నుంచి రోడ్డుపైకి పందులు రావడంతో వాటిని ఢీకొని కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులోని ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలవగా కారు దెబ్బతింది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం చాకలికొండ, కాటేపల్లి పంచాయతీల్లో కావలి డీఎల్పీఓ రమణ బుధవారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు శేఖర్, నరసింహ, ఇన్చార్జి ఈఓపీఆర్డీ కే రామారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఉదయగిరి దుర్గంపై పర్యాటకుల సందడి



ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపై బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. సఫర్ మాసం ఆఖరి బుధవారం నాడు కుటుంబ సమేతంగా వనభోజనాలకు వెళ్లి పచ్చిక బయళ్లు తొక్కితే పాపాలు పోయి పుణ్యం లభిస్తుందని ముస్లింల నమ్మకం. ఈ నేపథ్యంలో పట్టణంతో పాటు నెల్లూరు, కావలి, ఆత్మకూరు, పామూరు వింజమూరు, సీతారామపురం, బద్వేల్, తదితర ప్రాంతాలకు చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా ఉదయగిరి దుర్గంపైకి చేరుకుని వనభోజనాలు చేశారు. చారిత్రక కట్టడాలను తిలకించి ఆటపాటలతో గడిపారు. కాగా దుర్గంపై ఉన్న జటిఫట్ బీబీ దర్గాలో గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వాగులు పొంగితే నరకమే



ముత్తుకూరు వద్ద పొంగిన కొమ్మలేరు వాగు చప్టాపై ఈదుకుంటూ వెళ్తున్న ప్రజలు (ఫైల్)



రేవూరు వద్ద ఉన్న లోలెవల్ చప్టా

మండలంలోని పలు మార్గాల్లో లోలెవల్ చప్టాలు

- వర్షాకాలంలో చప్టాలపై ప్రవహిస్తున్న వాగులు
- గ్రామాలకు రోజుల తరబడి నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామీణులు
- హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలని గ్రామీణుల విజ్ఞప్తి

సోమశిల: అనంతసాగరం మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వర్షాకాలంలో వాగులు పొంగితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. లోలెవల్ చప్టాలపై రోజుల తరబడి నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ కారణంగా అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు సైతం చదువులకు దూరమవుతున్నారు.

లోలెవల్ చప్టాలతో కష్టాలు

అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో కొమ్మలేరు, కేతామన్నేరు వాగులు విస్తరించి ఉన్నాయి. మర్రిపాడు మండలంతో పాటు అనంతసాగరం మండలంలోని కొండలు, గ్రామాల్లో కురిసిన వర్షపు నీరు ఈ వాగుల ద్వారా చెరువుల్లోకి చేరి, ఆ తరువాత అలుగుల ద్వారా పెన్నానదిలో కలుస్తాయి. మండలంలో శంకరనగరం నుంచి సోమశిల వరకు ఆత్మకూరు-సోమశిల ప్రధాన రహదారిపై ఎనిమిది చోట్ల వాగులపై చప్టాలు ఉన్నాయి. రేవూరు వద్ద రెండు, వడ్డిపాళెం వద్ద ఒకటి, ముత్తుకూరు వద్ద కొమ్మలేరుపై ఒకటి, అనంతసాగరంలోని సవటి వాగు పైన ఒకటి, వరికుంటపాడు వద్ద అలుగు వాగుపై ఒకటి, ఉప్పలపాడు చెరువు అలుగు వద్ద ఒకటి, కమ్మవారిపల్లి వద్ద ఒకటి చొప్పున చప్టాలు ఉన్నాయి. వీటిపై వర్షాకాలంలో నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆ సమయంలో గర్భిణులు, డయాలసిస్ రోగులు, అనారోగ్య బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు నరకాన్ని చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నడుముకు తాడులు కట్టుకుని వాగులు దాటించి ఆస్పత్రికి చేర్పించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని వాపోతున్నారు. విద్యార్థులు సైతం చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి



ముత్తుకూరు సమీపంలోని కొమ్మలేరు వాగు పొంగి చప్టాపై ప్రవహిస్తే వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. వర్షాకాలంలో రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, రోగులు ఆస్పత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. ప్రభుత్వ స్పందించి బ్రిడ్జిని నిర్మించాలి.

–రాపూరు వేణుగోపాల్రెడ్డి, ముత్తుకూరు

వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం



కమ్మవారిపల్లి వద్ద ఉన్న కొమ్మలేరు వాగు వర్షాకాలంలో పొంగి చప్టాపై ఉద్ధృతంగా ప్రవహిస్తే వాహనాల రాకపోకలు రోజుల తరబడి నిలిచిపోతున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. మరోవైపు చప్టాపై నీరు పారడం వల్ల పాచిపట్టి ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాల పాలవుతున్నారు. వాగులపై బ్రిడ్జిని నిర్మించి రాకపోకల సమస్యను పరిష్కరించాలి.

–అన్వర్బాషా, సీపీఎం మండల కార్యదర్శి

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ బుధవారం తెలిపారు. తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా 3, 4, 5, 22 వార్డుల్లో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. శుక్రవారం యథావిధిగా తాగునీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

అడహక్ తహసీల్దార్గా ఫజిహా

సీతారామపురం: మండల తహసీల్దార్గా షేక్ ఫజిహా నియమితులయ్యారు. ప్రస్తుతం మండల తహసీల్దార్గా పనిచేస్తున్న పీవీ కృష్ణారెడ్డి సస్పెండ్కు గురికావడంతో ఫజిహాను అడహక్ తహసీల్దార్గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లుగా తెలిసింది. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. కాగా ఆమె గతంలో మండల డిప్యూటీ తహసీల్దార్గా, సింగారెడ్డిపల్లె వీఆర్వోగా పనిచేసి ఉన్నారు.

బైక్ను ఢీకొన్న మినీవ్యాన్

–ఉపాధ్యాయుడికి తీవ్రగాయాలు

దుత్తలూరు : బైక్పై పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయుడిని మినీ వ్యాన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన దుత్తలూరు సబ్ స్టేషన్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాలు..ఏపీ ఆదర్శ పాఠశాలలో వృత్తి విద్యా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరేష్ దుత్తలూరు సెంటర్ నుంచి పాఠశాలకు బైక్పై వెళుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ సబ్స్టేషన్ వద్ద కావలి నుంచి మైదుకూరుకు వెళుతున్న మినీ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేష్ భుజంతోపాటు శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఆదిలక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు అన్యాయం



వరికుంటపాడు: ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు



సోమశిల: ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

సోమశిల: దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం అన్యాయమని సీపీఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా ఖండించారు. పెన్షన్ల తొలగింపుపై సీపీఎం ఆధ్వర్యంలో దివ్యాంగులు అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ ఐజాక్ప్రవీణ్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వర్బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెన్షన్లను తొలగించాలనే దురుద్దేశంతో రీ వెరిఫికేషన్ చేపట్టిందన్నారు. వికలత్వ శాతాన్ని తగ్గించి అనర్హులుగా పేర్కొంటూ దివ్యాంగుల పెన్షన్లను తొలగిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం అనర్హులుగా పేర్కొన్న దివ్యాంగులు 2014 టీడీపీ ప్రభుత్వ హయాం నుంచి పెన్షన్లు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన 170 పెన్షన్లను పునఃపరిశీలన చేసి తిరిగి పెన్షన్ ఇవ్వాలని, లేని పక్షంలో దివ్యాంగులతో కలిసి ఆందోళన చేపడుతామని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సంఘ మండలాధ్యక్షుడు బాబు, పెన్షన్దారులు కొండారెడ్డి, మస్తాన్బాషా, మహ్మద్గౌస్, ఖాజామొయిద్దీన్, జరీనా, పెంచలయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: దివ్యాంగులమైన తమ పింఛన్లను అన్యాయంగా తొలగించారని, పరిశీలించి న్యాయం చేయాలని తూర్పుబోయమడుగుల గ్రామానికి చెందిన చిలకపాటి వెంకటేశ్వర్లు, గాదంశెట్టి కిషోర్ ఎంపీడీఓ గోపి శ్రీనివాస్కు బుధవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో సుమారు 75 మంది దివ్యాంగు పింఛన్ లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది వైకల్యం లేదంటూ నోటీసులు జారీ చేశారని తెలిపారు. గతంలో 50 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉందని ధ్రువీకరిస్తూ సర్టిఫికెట్లు ఇవ్వగా, ప్రస్తుతం 40 శాతం కంటే తక్కువగా ఉందని నోటీసులు ఇచ్చారని వాపోయారు. తమ సర్టిఫికెట్లు పరిశీలించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

కూటమి ప్రభుత్వ దుర్మార్గపు చర్య

సీతారామపురం : దివ్యాంగుల పింఛన్ల తొలగింపు కూటమి ప్రభుత్వ దుర్మార్గపు చర్యకు పరాకాష్ట అని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి వస్తున్న పింఛన్లను తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో సదరం క్యాంపులో 80 శాతం వికలత్వం ఉన్నట్లుగా సర్టిఫికెట్ ఇచ్చిన వైద్యులు నేడు అదే వ్యక్తులకు 30 నుంచి 40 శాతంలోపు మాత్రమే ఉందని చూపడం కూటమి ప్రభుత్వ కుతంత్రాలకు నిదర్శనమన్నారు. పింఛన్పై ఆధారపడి జీవనం సాగిస్తున్న దివ్యాంగులను ఆంక్షల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకుని పింఛన్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవం



కలిగిరి: మండలంలోని చంద్రారెడ్డిపాళెంలో కోదండరామస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవాన్ని బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం సీతారాములకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరులోని సెంటర్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజైనా బుధవారం కృష్ణుడి విగ్రహాన్ని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భగవద్గీత శ్లోక పారాయణం చేశారు. కాగా వేడుకల్లో భాగంగా చివరి రోజైన గురువారం స్వామివారి ఊరేగింపు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శాస్త్రోక్తంగా బాలాలయ ప్రతిష్ట

ఉదయగిరి రూరల్: మండలంలోని సున్నంవారిచింతలలో రామాలయ పునర్నిర్మాణంలో భాగంగా బాలాలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చారణల నడుమ సీతారామలక్ష్మణులకు విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు.అనంతరం ఆలయంలోని విగ్రహాలను తొలగించి సమీపంలోని బాలాలయంలో కొలువుతీర్చారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ఉదయగిరి రూరల్: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు పోలీసుల అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. బుధవారం ఆయన పోలీస్స్టేషన్లో విలేకరులతో మాట్లాడారు. వినాయక ఉత్సవాలు నిర్వహించే వారు కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసే ప్రాంతం, నిమజ్జనం చేసే సమయం, ప్రాంతం, కమిటీ సభ్యుల వివరాలతో అనుమతులు పొందాలన్నారు. విద్యుత్, మైక్సెట్ ఏర్పాటుకు కూడా అనుమతులు ఉండాలన్నారు. ఉత్సవాల సందర్భంగా డీజేలు, పాటకచేరిలకు అనుమతులు లేవన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మురళి

ఉదయగిరి: పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు సహకరించాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాల తహసీల్దార్లు, సహాయ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో 3,27,297 మంది జనాభా ఉండగా, 323 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,41,742 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు బూత్లెవల్ ఏజెంట్లను నియమించుకుని వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వో ఎల్ రామ్మోహన్, సీనియర్ సహాయకులు నీహా, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధనను అందించాలి



విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న సుధీర్బాబు

దగదర్తి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనను అందించాలని జిల్లా అకడమిక్ పర్యవేక్షణాధికారి సుధీర్బాబు ఉపాధ్యాయులకు సూచించారు. దగదర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, భవిత సెంటర్, ఊచగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. బడిబయట పిల్లలను గుర్తించి తహసీల్దార్ సహకారంతో ఆధార్ నమోదు చేయించి పాఠశాలల్లో చేర్పించిన ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి మెరుగైన బోధనను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట రిసోర్స్పర్సన్ చల్లా వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్, హెచ్ఎంలు శ్రీధర్రెడ్డి, గురుప్రసాద్ ఉన్నారు.

దోమల నియంత్రణకు సహకరించాలి



కలిగిరి: దోమల నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది



ఉదయగిరిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



వరికుంటపాడు: రోనాల్డ్ రాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యసిబ్బంది

ఉదయగిరి: దోమల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని గండిపాళెం పీహెచ్సీ వైద్యాధికారిణులు శివకల్పన, వినీత కోరారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఉదయగిరిలోని రంగనాయకులస్వామి ఆలయం వద్ద నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి వైద్యారోగ్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి దోమల కారణంగా వ్యాపించే మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్గున్యా, తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. తొలుత పీహెచ్సీలోని వ్యాక్సిన్ గదిలో శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్బాబు, సీహెచ్ఓ శివకుమారి, హెచ్ఈ వెంకటేశ్వర్లు, పర్యవేక్షకులు అంకమ్మ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక పీహెచ్సీలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యాధికారిణి కరిష్మా శాస్త్రవేత్త సర్ రోనాల్డ్రాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్ రోనాల్రాస్ ఆడ ఎనాఫిలీస్ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని కనుగొన్న దినాన్ని ప్రపంచ దోమల దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. సీహెచ్ఓ రాజశేఖర్, సువార్తమ్మ, వెంకటయ్య యనమల శ్రీనివాసులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక పీహెచ్సీలో శాస్త్రవేత్త సర్ రోనాల్డ్రాస్ చిత్రపటానికి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు కృషి చేస్తామని వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

నులిపురుగులతో చిన్నారుల్లో రక్తహీనత



గురుకుల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఖాదర్వలి

ఆత్మకూరు: నులిపురుగులతో చిన్నారుల్లో రక్తహీనత తలెత్తుతుందని ఏడీఎంహెచ్ఓ ఎస్కే ఖాదర్వలి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ వారోత్సవాలను పురస్కరించుకుని ఆత్మకూరులోని బీసీ బాలికల గురుకుల పాఠశాలను యూహెచ్సీ డాక్టర్ ఎస్కే అస్మాతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నులిపురుగులతో తలెత్తే సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతుల శుభ్రత పాటించకపోవడం వల్ల నులిపురుగులు వస్తాయని తెలిపారు. వీటి కారణంగా రక్తహీనత తలెత్తుతుందని, నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలను తీసుకోవాలని సూచించారు. అనంతరం యూహెచ్సీను తనిఖీ చేసి వైద్యారోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. గురుకులం ప్రిన్సిపల్ రమ్యశ్రీ, యూహెచ్సీ సిబ్బంది ఎస్ సుధాకర్, జీ రవీంద్రారెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్గాంధీ జయంతి వేడుకలు



వింజమూరులో రాజీవ్గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వింజమూరు(ఉదయగిరి): దివంగత ప్రధాని రాజీవ్గాంధీ 81వ జయంతి వేడుకలను వింజమూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నివాసం ఉంటున్న పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తొలుత రాజీవ్గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జగదీశ్వర్రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరు రాజగోపాల్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చేవూరి శ్రీధర్రెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వీ నాగరాజు, నాయకులు పెంచలయ్య, వెంకటేశ్వర్లు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

లాటరీ పద్ధతిలో బార్లకు లైసెన్సులు

కావలి (జలదంకి): ప్రభుత్వం మూడేళ్ల కాల పరిమితితో బార్ల నిర్వహణకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. కావలి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బార్ల లైసెన్సుదారులు, నూతన దరఖాస్తుదారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన బార్లకు ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వానికి రూ. 5.10 లక్షల డీడీ చెల్లించాలని తెలిపారు. లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయిస్తామన్నారు.

ఉపఖజానా కార్యాలయ తనిఖీ



ఆత్మకూరు: స్థానిక ఉపఖజానా కార్యాలయాన్ని జిల్లా ఖజానా కార్యాలయ డీడీ గంగాద్రి బుధవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఉపఖజానా కార్యాలయ పరిధిలోని పింఛన్, ఉద్యోగుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆత్మకూరు ఉపఖజానా అధికారి మహమ్మద్ నవాజ్, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి షేక్ అఫ్రోజ్, సిబ్బంది పాల్గొన్నారు.